క్లుప్తంగా

యోగా శిక్షణ శిబిరం

భద్రాచలంటౌన్: వికాస తరంగిణి 151వ శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు భద్రాద్రి యోగ ఆరోగ్య మిషన్ బాధ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో శ్రీ జీయర్ మఠంలో జనవరి 2 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఉదయం 5.30 నుంచి 6.30 వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 8 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని వారు పేర్కొన్నారు.

'అద్దె' సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో అద్దె బస్సులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం డిపో మేనేజర్ రామారావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో డీజిల్ భారం అధికం అవుతోందన్నారు. ఒక్కప్పుడు పల్లెవెలుగుకు 56, ఎక్స్‌ప్రెస్‌కి 51గా ఇన్సూరెన్స్ కెపాసిటీ ఉండేదని ఇప్పుడు ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఒక్కొక బస్సుకు 100 నుంచి 120 వరకు పెరిగిందని తెలిపారు. దీంతో ఓవర్ లోడ్‌తో ప్రయాణించడం వల్ల ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ఇబ్బందులు తలెత్తితే ఆర్టీసీ అధికారులే పరిష్కరించాలని కోరారు. అద్దె బస్సుల సమస్యలకు పరిష్కారం చూపకుంటే జనవరి 5 నుంచి అన్ని అద్దె బస్సులను నిలిపి వేస్తామని అద్దె బస్సుల యాజమానుల సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు.

'ఏఐటీయూసీదే విజయం'

మణుగూరురూరల్: సింగరేణి వ్యాప్తంగా జరిగిన గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో ఏఐటీయూసీదే విజయమని ఆ యూనియన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మిక హక్కులు, సంక్షేమం కోసం ఆది నుంచి పోరాడిన ఏఐటీయూసీకే కార్మికవర్గం మెజార్టీని కట్టబెట్టారన్నారు. 11ఏరియాల్లో జరిగిన సింగరేణి ఎన్నికల్లో ఐదు ఏరియాల్లో అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గుర్తింపు సంఘంగా గెలిపించుకున్నారన్నారు. ఏఐటీయూసీ విజయం కార్మికుల విజయమన్నారు. ఏరియాలో రీకౌంటింగ్‌పై అధికారుల పట్టించుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీకి జిల్లా అధ్యక్షుడి రాజీనామా

మణుగూరురూరల్: బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్న ఇర్పా రవికుమార్ ఆ పార్టీకి, పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు గురువారం వెల్లడించారు. బహుజనుల కోసం పార్టీలో ఇంతకాలం ప్రజల సమస్యలపై పోరాటం చేయడం సంతోషంగా ఉందని, కాని ఇటీవల కాలంలో చోటుచేసుకున్న అనుకోని కారణాల రీత్యా తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే జారె

ములకలపల్లి: క్రీస్తు బోధనలు ఆచరణీయని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రంలో ములకలపల్లి పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కేక్ కట్ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వరంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణను దుశ్శాలువతో సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కోరంపల్లి చెన్నారావు, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, పలువురు ఫాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మణుగూరురూరల్: పట్టణంలోని ప్రైవేట్ స్కూల్ బస్ క్లీనర్‌గా పని చేస్తున్న గంగయ్య ఇటీవల మరణించగా.. గురువారం తెలంగాణ ప్రైవేట్ స్కూల్ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.11,900 నగదు, అరకింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో డ్రైవర్లు వెంకటరెడ్డి, శ్రీరామ్మూర్తి, వెంకట్, యాకయ్య, కృష్ణారెడ్డి, వేణు, రాకేష్, క్లీనర్ భద్రయ్య పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం

చర్లరూరల్: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో చర్ల మండలంలోని విజయకాలనీ ప్రాంతంలో గురువారం హోమియో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పూజ.. వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వ్యాధులకు హోమియో మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ


అశ్వారావుపేటరూరల్: ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


చంద్రుగొండ: గానుగపాడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు

రాష్ట్ర ప్రభుత్వం తామిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో భాగంగా ప్రజాపాలన పేరిన తీసుకొచ్చి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గురువారం మొదలైంది. ఆయా గ్రామాల్లో సంబంధిత అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేయగా.. లబ్ధిదారులు దరఖాస్తులను నింపి అందజేశారు. స్వీకరించిన అధికారులు రశీదును అందించారు. కాగా, దరఖాస్తును పూరించడంలో ఇబ్బందిపడుతున్నవారికి అక్కడి సిబ్బంది సహకరించారు. కార్యక్రమంలో ప్రజలకు తగిన ఏర్పాట్లు చేశారు. మొత్తంగా మొదటి రోజు ప్రజాపాలన కార్యక్రమం విజయవంతంగా సాగింది.

– సాక్షి నెట్‌వర్క్


బూర్గంపాడు: వేపలగడ్డలో దరఖాస్తులు ఇచ్చేందుకు క్యూకట్టిన మహిళలు


భద్రాచలంఅర్బన్: జీపీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


అశ్వారావుపేటరూరల్: అచ్యుతాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ


భద్రాచలంఅర్బన్: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు


మణుగూరురూరల్: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


కరకగూడెం: దరఖాస్తులను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ జైసింగ్


గుండాల: రోళ్లగడ్డలో శిబిరాన్ని సందర్శించిన ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు


బూర్గంపాడు: దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు


దుమ్ముగూడెం: ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్, మండల ప్రత్యేకాధికారి


అశ్వాపురం: ఆనందాపురం గ్రామసభలో ఎంపీపీ, ఏపీఎం


చర్ల: తేగడ వద్ద ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన జనం


అన్నపురెడ్డిపల్లి: దరఖాస్తుదారులకు రశీదు ఇస్తున్న ఎంపీడీఓ అన్నపూర్ణ


దుమ్ముగూడెం: దబ్బనూతులలో ప్రజాపాలనను పరిశీలిస్తున్న ఆర్డీఓ మంగీలాల్

గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలు

మణుగూరురూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల నేపథ్యంలో మణుగూరు ఏరియాలో ఐఎన్‌టీయూసీ విజయానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, కార్మికులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తొలుత ఏరియాలోని వివిధ గనుల్లోని కార్మికులకు కలుసుకుని అభినందనలు తెలిపారు. అనంతరం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా ఆరు ఏరియాల్లోని కార్మికులు ఐఎన్‌టీయూసీవిజయానికి సహకారం అందించడం హర్షణీయమన్నారు. మణుగూరు ఏరియాలో నాయకుల్లో, కార్యకర్తల్లో, కార్మికులలో మనోధైర్యాన్ని నింపిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, సీనియర్ నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, నామా వెంకటేశ్వరరావు, సోమరాజు, నాయకులు కాటిబోయిన నాగేశ్వరరావు, పీరినాకి నవీన్, వైస్‌ఎంపీపీ కేవీరావు, ఉపసర్పంచ్ పి.శంకర్, ఎంపీటీసీ జి.కోటేశ్వరరావు, రాజలింగు, కృష్ణచేతన్, పెదనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

దుమ్ముగూడెం: అమరవీరుల స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ చెరుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ కనితి రాజులు, కణితి సుబ్బయ్య 14వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సభలో ఆయన వారికి నివాళులు అర్పించి మాట్లాడారు. గత 2009లో మాజీ సర్పంచ్ కనితి రాజులు, కొమ్మనపల్లి గ్రామ పెద్ద కనితి సుబ్బయ్యలను ఆనాడు మావోయిస్టులు చంపారని గుర్తు చేశారు. అయినా సీపీఎం ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తునే ఉందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మర్మం చంద్రయ్య, నాయకులు సరియం ప్రసాద్, రేసు చిన్న వీరస్వామి, కోనబోయిన ధర్మరాజు, రేసు కాంతమ్మ, కొనెబోయిన రామారావు, కొరస గంగరాజు, రేసు తిరుపతిరావు, రేసు ధర్మయ్య, కాక బాలయ్య, కాంతారావు, సుబ్బయ్య, అపక రంగయ్య, రాంబాబు, సున్నం నాగేశ్వరరావు, సత్యం, కాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ లేక ఆగిన బడి బస్సు


డీజిల్ అయిపోవడంతో ములకపాడు వైద్యశాల ఎదుట నిలిచిన బస్సు

దుమ్ముగూడెం: వేలకు వేలు ఫీజులు తీసుకునే ప్రైవేట్ పాఠశాలల యజమాన్యం విద్యార్థులను తీసుకుని వెళ్లేందుకు ఉపయోగించే బస్సుల్లో డీజిల్ కూడా చూసుకోకుండా నడపడం, అవి మధ్య దారిలో ఆగిపోతుండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే.. భద్రాచలంలోని 'శ్రీ చైతన్య' ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు గురువారం దుమ్ముగూడెం, లక్ష్మీనగరం గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళుతోంది. ఈ క్రమంలో ఆ వాహనంలో డీజిల్ అయిపోవడంతో ములకపాడు వైద్యశాల దగ్గర నడిరోడ్డుపై ఆగిపోయింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు నానా హైరాన పడ్డారు. ఈ ఏడాదిలోనే ఇలా జరగడం ఇది మూడో సారి. గతంలో కూడా ఇదే స్కూల్ బస్సు రెండు సార్లు డీజిల్ లేక మార్గం మధ్యలో ఆగిపోయింది. దీనిపై పాఠశాల యజమాన్యానికి ఫిర్యాదు చేసినప్పటికీ మళ్లీ ఇప్పుడిలా జరిగిందని ఓ విద్యార్థి తండ్రి ఆరోపిస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల యజమాన్యం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కఠిన చర్యలు తీసుకుంటాం


దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ముజాహిద్

దమ్మపేట: మీ సేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ తీసుకున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ముజాహిద్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో తహసీల్‌లో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మీ సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రతి సేవకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు మించి ఒక్క రూపాయి అదనంగా డిమాండ్ చేసినా.. ఆ నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

చర్లరూరల్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా గురువారం చర్లలో జరిగిన విశ్రాంత ఉద్యోగుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, ఇర్పవడ్ల రాము, దొడ్డి సూరిబాబు, కాకి అనిల్ దొడ్డి తాతారావు, పోలిన రామచంద్రరావు, చింతా నాగబాబు, అలవాల మహేష్ నాయుడు, రాము, గోరింట్ల వెంకటేశ్వరరావు, కుక్కడపు సాయి సృజన్, సాయి, పంజా రాజు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: 41వ జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని చర్లలో గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం చర్ల యూనిట్ ఆధ్వర్యంలో చర్లలోని శాఖా గ్రంథాలయం ఆవరణలో యూనిట్ అధ్యక్షుడు డి.సర్వేశ్వరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపన రామ్మూర్తి మాట్లాడారు. పెన్షనర్ల సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించి భవన నిర్మాణం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి టీజే బాలరాజు, కోశాధికారి హెచ్ దైవాదీనం తదితరులు పాల్గొన్నారు.


చర్ల: సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం


భద్రాచలం: పార్టీ జెండావిష్కరణలో పాల్గొన్న పొదెం వీరయ్య, తదితరులు


కరకగూడెం: జెండా ఎగురవేస్తున్న ఇక్బాల్ హుస్సేన్

భద్రాచలం: కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆధ్వర్యంలో గురువారం భద్రాచలంలో ఘనంగా జరిపారు. డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన జెండా ఎగుర వేసి మాట్లాడారు. దేశంలో పేద ప్రజల పక్షాన నిలబడి చరిత్ర కాంగ్రెస్‌కే ఉందన్నారు. వేడుకల్లో మండల అధ్యక్షుడు సరెళ్ల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు బలుసు నాగ సతీష్, కాంగ్రెస్ నాయకులు అడబాల వెంకటేశ్వరరావు దొడ్డిపట్ల సత్య లింగం, సరెళ్ళ వెంకటేష్, సుధీర్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మణుగూరు మండల, మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయం, బాపనకుంట, పికె1 సెంటర్, శివలింగాపురం గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, నామా వెంకటేశ్వరరావు, కాటిబోయిన నాగేశ్వరరావు, పీరినాకి నవీన్, వైస్‌ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచులు పుచ్చకాయలశంకర్, కనకయ్య, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ తదితరులు పాల్గొన్నారు.

చర్ల: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ 139వ దినోత్సవాన్ని గురువారం చర్ల మండలంలో ఘనంగా నిర్వహించారు. చర్లలోని కాంగ్రెస్ పార్టీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని టీపీసీసీ సభ్యుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాదరావు ఆవిష్కరించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, బండారు రామకృష్ణ, దేవభక్తుని రామకృష్ణ, సుందరి సురేష్‌కుమార్, శిరిపురపు శివకుమార్, తోటమల్ల వరప్రసాద్, కారంపూడి సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నాయకుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర సురేష్, జలగం కృష్ణ, సాగర్, నితిన్, నాగబండి వెంకటేశ్వర్లు, వెంకటరత్నమ్మ, గొగ్గల రవి తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. బూర్గంపాడులోని పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి సంబురాలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అశ్వాపురం: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ సుజాత, భిక్షమయ్యలు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేశారు.


ప్రొటోకాల్ ధిక్కరణపై చర్యలు తీసుకోవాలి

గుండాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆరు గ్యారెంటీ పథకాలపై నిర్వహించే ప్రజాపాలన గ్రామ సభలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్కలు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రోళ్లగడ్డ, లింగగూడెం గ్రామ పంచాయతీల్లో తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారని పేర్కొన్నారు. ఆయా గ్రామ సభలకు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమను విస్మరించినట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి మండలాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాపాలనపై ప్రజల స్వరం

దుమ్ముగూడెం/దమ్మపేట: ప్రభుత్వం గురువారం నుంచి ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరించగా.. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు కదలివెళ్లారు. ఆయా పథకాల్లో తమకు కావాల్సిన వాటి కోసం అధికారులకు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారి మనోభావాలను వెలికితీసేందుకు సాక్షి ప్రయత్నించింది. ప్రభుత్వం గ్యారెంటీలను అమలు చేయడంలో కృతనిశ్చయంతో ఉన్నట్లు ప్రకటించడం, అందుకు అనుగుణంగా దరఖాస్తులను స్వీకరించడంతో ప్రజలు ఏ విధంగా స్పందిస్తున్నారో తెలుసుకునేందుకు యత్నించింది. అందులో భాగంగా ప్రజల ప్రతిస్పందనను వారి మాటల్లోనే మీ ముందు ఉంచుతున్నాం.


ఇందిరమ్మ ఇంటి కోసం..



ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. గతంలో డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ రాలేదు. గత 9 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న, ఇప్పుడు అవకాశం రావడంతో మళ్లీ దరఖాస్తు చేసుకున్న. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్న.

– తామ కాంతమ్మ, దబ్బనూతుల, దుమ్ముగూడెం

ఇల్లు లేక ఇబ్బంది..



ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నాం. ఆదివాసీ నిరుపేదలమైన మేము ఇళ్ల లేక ఇబ్బంది పడుతున్నాం. గత ప్రభుత్వంలో ఇళ్ల ఇస్తుందని ఎదురుచూశాం. కానీ ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఇస్తుందని తెలియడంతో దరఖాస్తు చేసుకున్నాం.

– కొర్సా దుర్గారావు, బట్టిగూడెం, దుమ్ముగూడెం

దరఖాస్తు విధానం బాగుంది



ప్రభుత్వం అన్ని గ్యారంటీ పథకాలకు కలిపి ఒకే దరఖాస్తును ఇవ్వడం చాలా బాగుంది. ఈ దరఖాస్తు వల్ల ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవల చుట్టూ తిరిగే బాధలు తప్పాయి. గత ప్రభుత్వ పాలనలో ఇల్లు కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేశాను కానీ ఆ ప్రభుత్వం, నాకు ఇల్లు మంజూరు చేయలేదు. ఈ గ్రామ సభలో ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాల కోసం దరఖాస్తు చేశాను.

– పాయం రాంభద్రం, బాలరాజుగూడెం, దమ్మపేట

ఇప్పటి వరకు ఇల్లు రాలేదు..



అప్పటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి, నాకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు వస్తుందని ఆశించాను. దాదాపుగా పదేళ్లు కాలాయాపన చేశారే తప్ప ఇల్లు ఇవ్వలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఇల్లు ఇస్తుందనే ఆశతో ప్రజా పాలన కార్యక్రమానికి వచ్చి, గృహ జ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాలకు కూడా దరఖాస్తు చేసుకున్నాను. ఈ ప్రభుత్వం అయినఇల్లు ఇస్తుందనే నమ్మకంతో ఉన్నాను.

– కొమరం లింగమ్మ, బాలరాజుగూడెం, దమ్మపేట

మహిళలకు వరం



మహాలక్ష్మి పథకం ఆర్థికంగా వెనుకబడి ఉన్న పేద మహిళల పాలిట ఒక వరంగా భావిస్తున్నాను. రెక్కాడితే గానీ డొక్కాడని పేద మహిళలకు, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి నెల లభించే రూ.2500లు కుటుంబ పోషణ, అవసరాలకు ఎంతగానో తోడ్పడతాయి. గత ప్రభుత్వం మాదిరిగా కేవలం హామీలకే పరిమితం కాకుండా, పథకాలను అమలు చేయాలని కోరుతున్నాను.

– కొమరం వెంకటమ్మ, బాలరాజుగూడెం, దమ్మపేట